

## జులై 1 నుంచి ఎల్ఎల్బి రెగ్యులర్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయ కళాశాలలో చదువుతున్న ఎల్ఎల్బి (ఐదేళ్లు, మూడేళ్ల) విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు జులై 1వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల బిఎల్ఎల్బి, మూడేళ్ల ఎల్ఎల్బి ( రెగ్యులర్) ఒకటో సెమిస్టర్ పరీక్షలు 1,3,5,8,10 తేదీల్లో ఉంటాయని పేర్కొన్నారు. అలానే 3,5 ఏళ్ల ఎల్ఎల్బి సప్లిమెంటరీ పరీక్షలు ఇదే తేదీలలో ఉంటాయని తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం కేంద్రంగా జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు.

# ఇఎంటి పోస్టుల భర్తీలో ఉల్లంఘనలు



**ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీలో గైడ్‌లెన్స్ ఉల్లంఘనల పరంపర కొనసాగుతోంది. 2022 ఆగష్టు, 2022 నవంబర్, 20 23 ఫిబవరి మాసాల్లో ఇఎంటి పోస్టుల భర్తీ ప్రక్రియ నడిచింది. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, గుంటూరు, పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లో పీజీలను రిక్రూట్‌మెంట్లకు అనుమతించినట్లు తెలుస్తోంది. కానీ కడప జిల్లాలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులో డిప్లమా పూర్తి చేసిన పీజీలను కాదని, డిగ్రీ కోర్సు తరహా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీ షియన్ చదివిన వారి అర్హులుగా నిర్ణయించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇందులోభాగంగా ఈనెల 18న డిగ్రీ కోర్సు పూర్తి చేసిన ముగ్గురికి అపాయింట్‌మెంట్ ఆర్డర్సు ఇవ్వనున్నట్లు సమాచారం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పలువురు పీజీలు పలుమార్లు కడప జిజిహెచ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో విస్మయాన్ని కలిగిస్తోంది.**

- రాష్ట్రమంతా ఒకదారైతే కడపలో మరోదారి
- అనర్హులుగా మెడికల్ ఇన్ సర్వీస్ పీజీలు
- 18న ముగ్గురికి అపాయింట్‌మెంట్లు?!
- నిద్రావస్థలో జిజిహెచ్ సూపరింటెండెంట్

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. ఈమేరకు గత ఫిబ్రవరిలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల యంత్రాంగం 48 ఇఎంటి పోస్టుల భర్తీకి నోటి ఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు 48 మంది టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 12 మంది పీజీ డిప్లమా, 12 మంది బిఎస్‌సి, మరో 18 మంది ఇతర కోర్సులు చేసిన అభ్యర్థుల దరఖాస్తులు ఉన్నట్లు సమాచారం. వీరిలో 12 పీజీ దరఖాస్తులను తిరస్కరించి భర్తీ చేపట్టడం పీజీల్లో ఆందోళన నెలకొంది. 2013 సంవత్సరంలో 108 సేవల విభాగంలో సీనియర్లుగా గుర్తింపు పొంది, ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసింది. బిఎసి కంటే ఉన్నత విద్య పీజీ కోర్సును అభ్యసించిన వారిని విస్మరించి డిగ్రీ (బిఎస్‌సి ఇఎంటి) చేసిన వారిని అర్హులుగా నిర్ణయించమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. 2022 నవంబర్‌లో విజయ నగరం, తాజాగా కడప జిల్లాలో మినహా మిగిలిన జిల్లాలో కొత్తగైడ్ లైన్స్ ప్రకారం పీజీలను పోస్టింగ్స్‌కు అర్హులుగా చేసి పోస్టుల భర్తీ నడిపిన జిల్లాలను ఉద హరిస్తుండడం గమనార్హం. కానీ జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ గైడ్ లెన్స్ అప్‌డేట్ గాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడంపై విమర్శల వర్షం కురుస్తోంది. 2022 ఆగష్టులో రాష్ట్రంలోని 10 పాత వైద్య కళా శాలలకు మూడు పోస్టుల చొప్పున 64 టెక్నీషియన్ పోస్టులను భర్తీ ప్రక్రియ నడిచింది. ఇందులో ఇప్పటి వరకు 61 పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం. మిగిలిన మూడు పోస్టులు జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందినవి కావడం గమనార్హం. వీటిని భర్తీ చేయాలనే అప్పటి జాయింట్ కలెక్టర్ సూచనను జిజిహెచ్ సూపరింటెండెంట్ బేఖాతర్ చేశారనే విమర్శలు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి యూనివర్శిటీగా నామకరణం చేసిన మెడికల్ కళాశాలల్లో ఆయన ఉన్నత విద్యకు సిఫారసు చేసిన పీజీ అభ్యర్థులను తిరస్కరించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో పీజీ డిప్లమా, బిఎస్‌సి ఇఎంటిలకు సమాన అవకాశాలు కల్పించిన అనంతరం మెరిట్ ఆధారంగా రిక్రూట్‌మెంట్ నిర్వహించాలనే వాదన వినిపిస్తోంది. దీనిపై పీజీలు పలుమార్లు సూపరింటెండెంట్‌ను కలిసి రాష్ట్రంలోని ఇతర జిల్లాల రిక్రూట్‌మెంట్ ప్రక్రియల కాపీలను చూపించినప్పటికీ అప్‌డేట్ గాకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇదేతరహా ధోరణిలోనే ఈనెల 18న మెడికల్ ఎమర్జెన్సీ మెడికల్ కోర్సు పూర్తి చేసిన పీజీలను కాదని, బిఎస్‌సి డిగ్రీ కోర్సు ఆధారిత మెడికల్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ పూర్తి చేసిన ముగ్గురికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనుండడంపై ఆందోళన నెలకొంది.

### మరోసారి నోటిఫికేషన్ పరిశీలన

నోటిఫికేషన్ ఆధారంగా ఇఎంటి పోస్టింగ్స్ భర్తీ చేస్తాం. గత ఫిబ్ర వరిలో విడుదల చేసిన పాత నోటిఫికేషన్ ఆధారంగా భర్తీ ప్రక్రియ కొలిక్కి వచ్చిన మాట వాస్తవమే. తాజాగా మరోసారి నోటిఫికేషన్ పరిశీలన చేసిన అనంతరం పోస్టింగులను భర్తీ చేస్తాం.

**-కె.రమాదేవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, కడప.**

## విద్యుత్ సంస్థల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలి

**యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి**

**ప్రజాశక్తి కడప అర్బన్**



సమావేశంలో మాట్లాడుతున్న యుఇఇయు, సిఐటియు నాయకులు

విద్యుత్ సంస్థలలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని, అవినీతిని అరికట్టాలని యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుదర్శన్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కడపజిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బి. నాగసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, యూనియన్ హక్కులు కోల్పోయారని, పూర్తిగా రాజకీయ జోక్యంతో బదిలీలు ఇతర కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సంస్థలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరారు. కామనురు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సాను భూతిపరులని కొంతమంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఇప్పుడు కూడా ప్రస్తుతం అదే పద్ధతిని కొనసాగించేందుకు ప్రయత్నం చేయడం సరికాదని పేర్కొన్నారు. చిన్న ఉద్యోగుల పట్ల కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పనిచేయాలని మనవి చేశారు. డిస్కాం ప్రెసిడెంట్ ఎస్.శివ శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ సంస్థలోనూ పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, వాటన్నిటి పైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అ గతంలో ఉన్న సర్వీస్ రెగ్యులేషన్స్ ప్రకారం కారుణ్య నియామకాలు, వారికి సంబంధించిన వేతనాలు చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు మేలు చేసేలా ఒకే వేతన విధానం అమలు చేయాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగులు, ఎనర్జీ అసిస్టెంట్లు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ఎన్ని వినతి సమర్పించిన యాజమాన్యం సరైన రీతిలో స్పందించలేదని చెప్పారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో ఈ సమస్యలు అన్నిటి పైన విద్యుత్ యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాయిబ్ రసూల్, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్రబాబు, జిల్లా కార్యదర్శి వెంకటరమణ, పుల్లయ్య, రాజంపేట డివిజన్ నాయకులు ఎరికల రెడ్డి, సుబ్బారెడ్డి, పొద్దుటూరు డివిజన్ నాయకులు మహబూబ్ షరీఫ్, మైదుకూరు డివిజన్ నాయకులు నాగ మల్లయ్య, రామ్మోహన్, కడప డివిజన్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రాయచోటి డివిజన్ నాయకులు రెడ్డప్ప, అమర్నాథ్‌రెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

## టిడిపి డివిజన్ కార్యాలయం ప్రారంభం



టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

**ప్రజాశక్తి-కడప అర్బన్**

నగరంలోని అప్సర సర్కిల్ వద్ద ఓబుల్ రెడ్డి కాంప్లెక్స్‌లో టిడిపి ఒకటవ డివిజన్ నుంచి 13వ డివిజన్ వరకు పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే మాధవి, టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో పండితులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**కాలభైరవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

నగర పరిధిలోని ఎమ్మెస్ కొట్టాలలో కొలువుదీరిన కాలభైరవ స్వామిని కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులుశ్రీనివాసరెడ్డి ఆదివారం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహింప చేశారు. స్వామివారి అర్చకులు కాలభైరవ స్వామి చిత్రపటాన్ని వారికి అంద జేయగా, స్థానికులు దృశ్యాలువతో వారిని ఘనంగా సత్కరి ంచారు. అనంతరం చిన్న బెస్తవీధిలో విందు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఆకాశవాణిలో ప్రత్యేక కార్యక్రమం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఈనెల 17న ఆకాశవాణి కడప కేంద్రం 62వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో రేడియోలో ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు కడప కేంద్రం ప్రోగ్రామ్‌హెడ్ చుండూరి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అనుభవాలు- అపూర్వ కార్యక్రమాల పేరుతో ఎస్. రవికుమార్‌రెడ్డి రచించిన కార్యక్రమం ప్రసారం కానుందని పేర్కొన్నారు. ఇందులో వివిధ రంగాల ప్రముఖులతో పరిచయాలు, శ్రోతల మదిని దోచిన పలు అంశాలు ఉంటాయని తెలిపారు. మీడియం వేవ్, ఎఫ్ఎం ద్వారానే కాకుండా శ్రోతలు న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ ద్వారా కార్యక్రమాలను వినవచ్చని పేర్కొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులతో దాతలు

**ప్రజాశక్తి -బద్వేల్**

2023-2024 విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు దాతల ద్వారా ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున నగదు బహుమతి, మహనీయుల ఫొటో జ్ఞాపిక, పెన్నుల ప్యాకెట్టు, ప్రశంసాపత్రం అందజేశారు. బద్వేల్ పట్టణంలోని బిసి వసతి బాలుర వసతి గృహంలో పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బద్వేల్ గురుమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా గోపవరం మండల విద్యాశాఖ అధికారి ఎన్. చెన్నయ్య, యోగివేమన యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ యర్రగొల్ల గోపాలస్వామి, శ్రీరామ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీరామరాజు హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ బిసి వసతి గృహాలలో ఉంటున్న పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఇష్టంతో, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగాలని పేర్కొన్నారు. పూలే, అంబేద్కర్, అబ్దుల్ కలాం లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి జీవిత చరిత్రలు చదవి ఆచరించి ఉన్నత మన్నులు పొందాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని బిసి హాస్టల్‌లలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి వారికి, వసతి సౌకర్యాలు మెరుగుపరచడానికి జిల్లా అధికారులు, హాస్టళ్ల సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో అరకొర వసతులతో అద్దె భవనాలలో బి.సి వసతి గృహాలకు పక్కాభవనాల నిర్మాణం, శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న సిబ్బంది వెంటనే నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఇఒ చెన్నయ్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారి యన్.ప్రసాద్, కమాటి వి.జగదీశంను శాలువాలతో సన్మానించడమైంది. కార్యక్రమంలో బి.సి ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్బరాయుడు, బి.సి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యు.వి రమణయాదవ్,ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.వి సుబ్బారావు, బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ కన్వీనర్ నానబాల వెంకటేశ్వర్లు, ఆవాజ్ కమిటీ బద్వేలు పట్టణ అధ్యక్షులు యస్.ఎ సత్తార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్వర్ బాష బిసి విద్యార్థి సంఘం నాయకులు వంగిమల్ల రీతేష్ కుమార్, బి.సి సంఘం నాయకులు బాలయ్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు యన్.ప్రసాద్, సుభాష్‌చంద్ర, ,హరికృష్ణ, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాలువల ఆధునికీకరణకు పాతర!

### పేరుకుపోయిన గడ్డి, పిచ్చి మొక్కలు - పట్టని అధికారులు



పైడిపాలెం కాలువలో పేరుకుపోయిన గడ్డి, ఇతర పిచ్చి మొక్కలు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

నియోజవర్గంలోని ప్రధాన సాగునీటి వనరులైన పులివెందుల బ్రాంచ్ కెనాల్, పైడిపాలెం ప్రాజెక్టు కాలువలు ఆధునీకరణకు నోచుకోలేదు. దీని కారణంగా కాలువలలో గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడంతో నీటి సరఫరాలో ఆటంకం కలుగుతోంది. పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పిబిసి) పరిధిలోని సింహాద్రిపురం, తొండూరు, పులివెందుల, లింగాల, వేముల మండలాలకు సంబంధించి 54,000 ఎకరాలలో ఆయకట్టు భూమి ఉంది. ఈ ఆయకట్టుకు పార్నపల్లి సమీపంలోని ఉన్న చిత్రావతి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేవారు. అయితే పైడిపాలెం ప్రాజెక్టు ప్రారంభం అనంతరం ఆ ప్రాజెక్టు నుంచి హిమకుంట్ల చెరువుకు పంపింగ్ చేసి అక్కడి నుంచి పిబిసి కాలువలోకి పంపింగ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. అయితే పైడిపాలెం రిజర్వాయర్ నుంచి వచ్చే కాలువలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరగడంతో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. దీంతో డ్యామ్ నుంచి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే వదులుతున్నారు. తొండూరు డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని కాలువలో సైతంగడ్డి( జంబు) అధికంగా పెరిగింది. ఈ రెండు కాలువలలో గడ్డి, మట్టి, ఇతర పిచ్చి మొక్కల కారణంగా నీటి సరఫరా ఆటంకం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో కాలువలలో నీటి సరఫరా నిపివేశారు. కావున సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కాలువలోని పూడికను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



పిబిసి కాలువలో పెరిగిన గడ్డి

### అసంపూర్తిగా పనులు..

తొండూరు డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని కాలువలలో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి( జంబు) ను ఉపాధి కూలీలచే పనులు చేయించారు. అయితే ఈ పనులు అసంపూర్తి జరిగాయి. కేవలం కూలీలు జంబు గడ్డిని పైపైన మాత్రమే తొలగించారు. అధికారులు జెసిబిలు సాయంతో పూర్తిస్థాయిలో కాలువలలో మట్టి, రాళ్లు, గడ్డిని బయటికి తొలగించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### కాలువల్లో గడ్డి, మట్టిని తొలగించాలి

పైడిపాలెం, పులివెందుల బ్రాంచ్ కెనాల్ కాల్వలలో పేరుకుపోయిన గడ్డి, మట్టి రాళ్లను సైతం బయటికి తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. దీని కారణంగా నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. కావున అధికారులు చర్యలు తీసుకొని వాటిని తొలగించాలి.

**- మహేశ్వర్ రెడ్డి, రైతు, సింహాద్రిపురం.**

### మా దృష్టికి వచ్చింది

పైడిపాలెం ప్రాజెక్టు నుంచి హిమకుంట్ల చెరువు వరకు ఉన్న కాలువలలో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటి తొలగింపు పనులు త్వరలోనే చేపట్టి పూర్తిస్థాయిలో కాలువలో లేకుండా చర్యలు తీసుకుంటాం.

**-శ్రీనివాస్, డిఇఇ, జికెఎల్ఐ ప్రాజెక్టు.**

## కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలకు అభినందనలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కేంద్రసాహిత్య అకాడమీ 2024 ప్రకటించిన పురస్కారాలు పొందిన పి.చంద్రశేఖర్ ఆజాద్, రమేష్ నాయక్, కార్తీక్‌కు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి. రామప్రసాదరెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ రచించిన 'మాయాలోకం' బాలల కథా సంపుటికి అకాడమీ బాలసాహిత్యంలో పురస్కారం ప్రకటించిందని, రమేష్ నాయక్, కార్తీక్ రచించిన కథల సంపుటి 'ఢావ్లో' కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించిందన్నారు. చంద్రశేఖర అజాద్ వెలువరించిన పుస్తకాల్లో రోడ్డు మీద గులాబీ (కథల సంపుటి), పి.చంద్రశేఖర అజాద్ కథలు (కథల సంపుటి), అహానికి రంగుండదు (నవల), ఫ్యామిలీ ఫొటో (నవల), అడవి (నవల), కిడ్నాప్ కిడ్నాప్ (నవల), శ్వేతపత్రం (నవల), మహావృక్షం (నవల) లాంటివి ప్రధానమైనవన్నారు. రమేష్ నాయక్ కార్తీక్ బంజారా సమాజం యొక్క జీవనశైలి గురించి ప్రముఖంగా బంజారీ భాషను తెలుగు లిపిలో, తెలుగులో, ఆంగ్లంలో కూడా రాస్తారన్నారు. ఆయన రచనలు పొయెట్రీ ఎట్ సంగమ్, ఇండియన్ పీరియాడికల్, ల్కెవ్ వైర్, ఔట్‌లుక్ ఇండియా, నెదర్ క్వార్టర్లీ, బోర్డర్‌లెస్ జర్నల్‌లో ప్రచురించబడ్డాయన్నారు. పి.చంద్రశేఖర్ ఆజాద్, రమేష్ నాయక్ కార్తీక్ లకు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణ, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది అభినందనలు తెలిపారు.


## పేదలకు ప్రభుత్వ భూమి పంచాలి

**ప్రజాశక్తి-అట్లూరు**

పేదలకు ప్రభుత్వ భూమి పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రమణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం అట్లూరు క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్యం వచ్చి 75 సంవత్సరాలైనా కోట్లాదిమంది పేదలకు నేటికీ జానెడు భూమి లేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా పేదల బతుకులు మారడం వాపోయారు. అట్లూరు మండలంలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని భూస్వాములు కబ్జాలు చేశారని, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం స్పందించి కబ్జా అయిన స్థలాలను గుర్తించి అర్హులైన నిరుపేదలకు మూడు ఎకరాలు భూమి ఇవ్వాలని అన్నారు. అసైన్డ్‌మెంట్ కమిటీలు అలంకార ప్రాయంగా ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. 17 ఏళ్లుగా అసైన్డ్ మెంట్ కమిటీ నిర్వహించి పేదలకు భూములు పంచలేదని వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక, భూములు లేక పట్టణాలకు, ఇతర దేశాలకు వలస వెళ్తున్నారని పేర్కొన్నారు. పీజీ, బిటెక్, ఎంటెక్ వంటి ఉన్నత చదువులు చదివి సరైన ఉపాధి అవకాశాలు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు దుర్గమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రవిచంద్ర, షరీఫ్, సుభద్ర పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

**ప్రజాశక్తి - కడప అర్బన్**



మంత్రితో టిడిపి నాయకులు

ర వా ణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి, నగర ఉపాధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, షేక్. జావిద్ బాష కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరి సహకారంతో ఉమ్మడి కడప జిల్లాను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఓట్లేసి



మాధవికి బొకే అందజేస్తున్న శివార్జున

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఆదివారం కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో తెలుగుదేశం పార్టీ తరపున మొట్ట మొదటిసారిగా మహిళా అభ్యర్థిని గెలుపొందడం చారి త్రాత్మకమని పేర్కొన్నారు. కడప అసెంబ్లీ నియోజకవర్గానికి గర్వ కారణమని తెలిపారు. రాష్ట్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సమస్యలు చాలా ఉన్నాయని వాటిలో 117 జీవో రద్దు,12వ పిఆర్‌సి అమలు, పెండింగ్ డిఎలు, బకాయిలు విడుదల తదితర ప్రధాన అంశాల పరిష్కారంలో తమ వంతు సహకారం అంది ంచాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నా వంతు సహ కారాన్ని అందిస్తానని అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేంద్ర గుత్తి గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్, జయ రాముడు, సురేంద్ర, సల్లగాల్ల వెంకటరమణ, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీరాములు కిరణ్ బాబు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ఎపిఎండిసి డైరెక్టర్ పదవికి 'ముడమాల' రాజీనామా

**ప్రజాశక్తి-అట్లూరు**

ఎపిఎండిసి డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఎన్నికలలో ఓటమి చెందిన కారణంగా నైతిక బాధ్యతగా రాజీనామా సమర్పించినట్లు ఆయన తెలిపారు. గతంలో ఈ పదవికి కారణమైన ఎమ్మెల్సీ డి .సి గోవింద్‌రెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# వేంపల్లెలో పారిశుధ్యం.. అధ్వానం

## రోడ్లపై పారుతున్న మురుగు నీరు - ప్రజలకు తప్పని తిప్పలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

మండల కేంద్రమైన వేంపల్లెలో పారిశుధ్యం పనులు అధ్వానంగా మారాయి. వేంపల్లె పంచాయతీలోని ఆయా ప్రాంతాల్లో రోడ్లుపై మురికి నీరు పారుతోంది. పాదచారులు మురికి నీటిలోనే నడవాల్సి వస్తోంది. వాహన దారులు, ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. పారిశుధ్యానికి సంబంధించిన పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అటు గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులుగానీ, ఇటు అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులుగానీ పారిశుధ్యంపై పట్టించుకోకపోవడంతో వేంపల్లెలో అపరిశుభ్రత తాండవిస్తోంది. డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయక పోవడం, చెత్త చెదారం కాలువలో పడి మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అంతేకాక నివాసాల వద్ద ఆ నీరు నిలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే మురికి నీరు తొక్కాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వాతావరణం మార్పుల వల్ల ప్రజలు పలు రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గరుగువీధి డ్రయినేజీ కాలువల్లో ఉన్న మురికి నీరు రోడ్లపైనే పారుతోంది. అలాగే రవిగౌడ్ వీధిలో కూడా మురికి నీరు రోడ్లపై ప్రవహించడంతో ఆప్రాంతంలో తిరిగే ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. పిరమిడ్ నగర్ వీధిలోని ప్రధాన రహదారిలో కల్వర్టు పనులు పూర్తయి 15 రోజులు అవుతున్నా కల్వర్టులో ఉన్న చెత్తను తొలగించలేదని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు ఆరోపించారు. పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో వర్షపు నీరు పోవడానికి వీల్లేకుండా పోయిందని పిరమిడ్ నగర్ వీధి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఒక వేళ కాలువల్లోని చెత్త చెదారం తీసినా దాన్ని ఎత్తక పోవడంతో మళ్లీ కాలువల్లోనే పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల ఆదేశాలను సిబ్బంది బేఖాతరు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ సరిగా లేక పోవడంతో వేంపల్లెలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ ఇఒను వివరణ కోరగా.. ప్రతి రోజూ రోడ్లపై ఉన్న చెత్తను తొలగిస్తున్నామన్నారు. పారిశుధ్యంపై తన దృష్టికి వచ్చిన వెంటనే ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేయించి సమస్య పరిష్కారం చేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టామన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు తానే స్వయంగా వెళ్లి పరిశీలించి, సిబ్బందితో పనులను చేయిస్తున్నట్లు చెప్పారు.


రవి గౌడ్ వీధిలో ప్రవహిస్తున్న మురుగు నీరు

**దోమల బెడద ఎక్కువైంది**

పారిశుధ్యం పనులు సక్రమంగా ప్రతి రోజూ జరగక పోవడంతో దోమల బెడద ఎక్కువైంది. డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయక మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వీధుల్లో పూడ్చి వేసిన డ్రెయినేజీ కాలువలకు మరమ్మతులు చేయాలి. డ్రెయినేజీ కాలువల్లో తీసిన చెత్తను వెంటనే ఎత్తివేయాలి. ఈద్గా సమీపంలో నిల్వ ఉన్న వర్షపు నీరు, మురికి నీటిని తొలగించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

**- డాక్టర్ కరీముల్లా, వేంపల్లె**


గరుగువీధిలో రోడ్లపై ప్రహహిస్తున్న మురుగు నీరు

## రాష్ట్రంలో ప్రజా రంజకపాలన

**టిడిపి యువనేత జింకల మహబూబ్‌బాషా**

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**



ఇక రాష్ట్రంలో ప్రజారంజక పాలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐదు సంతకాలతో శ్రీకారం చుట్టారని జమ్మలమడుగు పట్టణానికి చెందిన టిడిపి యువనేత జింకల మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 175 స్థానాలకు 164 స్థానాల్లో కూటమి విజయకేతనం ఎగరవేసిందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే చంద్రబాబు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్లు, అన్నా క్యాంటీన్లు, స్కిల్ డెవలప్మెంట్ వంటి ఐదు అంశాలపై సంతకం చేశారన్నారు. ఇది నిరుద్యోగ యువతలో, పింఛన్ తీసుకునే వారిలో, రైతుల్లో, అన్నార్తుల్లో సంతోషాన్ని నింపిందన్నారు. మారిన బాబును చూస్తారని చెప్పినట్లుగానే మంత్రులకు శాఖలు కేటాయించడంతో ముఖ్యమంత్రి తనదైన శైలి చూపించారన్నారు. రాష్ట్ర భవిష్యత్ యువ ప్రజా ప్రతినిధుల చేతుల్లో కీలక మంత్రిత్వ శాఖలు బాబు పెట్టారన్నారు. నియోజకవర్గంలో టిడిపి ఇంఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామి రెడ్డి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలసి ప్రజాసంక్షేమంతోపాటు అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తారన్నారు. టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలకు మంచిరోజులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, భూపేష్ రెడ్డి ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించే పనిలో ఉన్నారన్నారు. సంస్థలన్నీ ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పాలగిరి సుబ్బారెడ్డి

## కమలాపురం ఎమ్మెల్యే అభిమాని రూ.లక్ష విరాళం

**అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి**

**ప్రజాశక్తి - చక్రాయపేట**

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రానికి వచ్చే భక్తుల నిత్యాన్నదానం కోసం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అభిమాని కమలాపురం పట్టణ వాస్తవ్యులు పాలగిరి సుబ్బారెడ్డి ఆదివారం రూ.1,00,116 విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ముందుగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అంజన్న సన్నిధిలో వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ రవి చంద్రారెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వరదను సన్మానిస్తున్న డీలర్లు

## ఎమ్మెల్యే 'వరద'కు డీలర్ల సన్మానం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

రేషన్ షాపు డీలర్లు ఆదివారం ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డిని ఘనంగా సన్మానించారు. రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ 2019కి ముందు ఉన్న విధానాలను పునరుద్ధరించాలన్నారు. గోడౌన్‌ల వద్దే కాటాను తెరవాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం, అంగన్వాడీలకు సంబంధించిన బకాయి ఉన్న కమీషన్లను మంజూరు చేయాలని కోరారు. తమ సంఘానికి చెందిన రాష్ట్ర నాయకులు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిశారని, ఆ మేరకు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆయన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కోరారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునర్ధరించాలి

**వేంపల్లె :** భవన నిర్మాణ కార్మిక సంఘానికి చెందిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఆదివారం స్థానిక జిటి కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభు త్వం పాలనలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశార న్నారు. టిడిపి పాలనలో నైనా సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచపు లిం గన్న, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా బాలాజీ, నాగేశ్వర రావు, దస్తగిరి, శ్రీని వాసులు పాల్గొన్నారు.



# పొదుపు సంఘాల్లో సిబ్బంది చేతివాటం

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

పట్టణ పేదరిక నిర్మూలన కోసం మెప్మా సంస్థ ద్వారా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. వీటిలో ముఖ్యంగా ఆర్థికాభివృద్ధి, జీవనోపాదుల మెరుగుదల, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు ప్రవేశపెట్టింది. మహిళాభివృద్ధికి ప్రభుత్వం వడ్డీ లేని బ్యాంకు రుణాలు, ఎస్ఇపి రుణాలు, ముద్రా రుణాలు వంటి పలు రకాల స్కీముల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతానికి ప్రభుత్వం మెప్మా సంస్థ ద్వారా స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అర్హులైన మహిళలకు స్వయం సహాయక సంఘం, పట్టణస్థాయి సమాఖ్యల ద్వారా చేరువ చేయుటకు వివిధ స్థాయిలో ఆర్‌పి, సిఒ, సీఎంఎం, టిఈ, పీడీలు కీలక పాత్ర పోషిస్తుంటారు. ఇంతటి సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి పని చేస్తోంది. ఎర్రగుంట్ల పట్టణంలో 637 స్వయం సహాయక సంఘాలకుగానూ 23 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. ఒక్కో ఆర్పీకి ప్రభుత్వం గౌరవ వేతనంగా రూ.10వేలు అందిస్తోంది. పొదుపు సంఘాల మహిళా సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు అయిన సమయంలో కమిషన్ల కోసం కొందరు కక్కుర్తి పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. పొదుపు సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు అయిన సమయంలో పదిమందితో కూడిన సంఘం నుండి ఒక్కో సభ్యురాలి వద్ద నుండి రూ.200 వసూలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో రూ.120, అనంతరం రూ.150గా ఉండేది. తాజాగా రూ.200 అడుగుతున్నట్లు పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో పట్టణానికి చెందిన ఓ సంఘానికి రూ.20 లక్షలు రుణం మంజూరైనప్పుడు ఒక్కో సభ్యురాలు రూ.వెయ్యి వంతున చెల్లించాల్సిందేనని సదరు సంఘానికి సంబంధించిన ఆర్పీ డిమాండ్ చేసిన సంగతి అప్పట్లో స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇలా కొందరు ఆర్పీలు పొదుపు సంఘాల నుండి మామూళ్లకు పాల్పడుతున్నా ఉన్నతాధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటువంటి కొందరు ఆర్పీల ద్వారా మెప్మా సంస్థకే చెడ్డ పేరు తెచ్చే అవకాశం ఉందని అభిప్రా యపడుతున్నారు. మామూళ్లకు తెర లేపుతున్న ఆర్పీలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జగనన్న ఇళ్లపై విచారణ జరిపించాలి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**


ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

పులివెందుల మున్సిపాలిటీలో జగనన్న గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసిన 8000 ఇళ్లపై విచారణ జరపాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినట్లు టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి పదవిలో ఉన్నప్పుడు ఇల్లు లేని పేదలకు 8000 ఇళ్లను మంజూరు చేశారు. అర్హులైన లబ్ధిదారులు లేకున్నా అందరినీ ఎంపిక చేశారు. ధనవంతులకు, ఇతర ప్రాంతాల వారికి, ఉద్యోగులకు ఇళ్లను మంజూరు చేశారని, ఇందుకు సంబంధించి అనేక ఫిర్యాదులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందించలేదన్నారు. ఇళ్ల మంజూరు కుంభకోణంలో కీలక పాత్ర వహించిన అప్పటి జాయింట్ కలెక్టర్, అప్పటి పులివెందుల మున్సిపల్ కమిషనర్, బాధ్యులపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సదరు నకిలీ లబ్ధిదారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**ఆర్‌జెడి, డిఇఒపై చర్యలు తీసుకోండి**

**పులివెందుల టౌన్ :** అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఆర్‌జెడి రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత ప్రభు త్వంలో డిఇఒగా, ఆర్‌జెడిగా వైసిపి నాయ కుని కన్నా అధ్వానంగా పనిచేశాడన్నారు. ఇష్టానుసారంగా బదిలీలు చేయడం, ఉపా ధ్యాయులను దూషించడం, మహిళా టీచర్లతో అసభ్యంగా ప్రవర్తించడం, ప్రైవేటు పాఠ శాలలు నిబంధనలు పాటించకున్నా అను మతులు ఇవ్వడం వంటి అనేక అక్రమాలు చేశాడని ఆరోపించారు. కౌన్సి లింగ్ లేకుండా లంచాలు తీసుకుని బదిలీలు, డిప్యూటేషన్ చేశాడన్నారు. ప్రశ్నిస్తే వారిని విధుల నుండి తొలగించేవారని రాష్ట్రంలో ఏ జిల్లాలో ఇవ్వని విధంగా టీచర్లు నిరసనలు చేయరాదని ఉత్తర్వులు కూడా ఇచ్చాడన్నారు. ఒక అధికారి చేయకూడని పనులన్నీ చేశాడన్నారు. 2023 మార్చిలో జరిగిన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు మద్దతుగా పనిచేశాడని తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఇలాంటివారు విద్యాశాఖలో ఉండడానికి అర్హులు కారన్నారు. వెంటనే వీరిద్దరిని సస్పెండ్ చేసి అక్రమాలపై విచారణ జరిపించి, కఠినంగా శిక్షించాలని కోరుతున్నామని ఎమ్మెల్సీ తెలిపారు.

# సతీష్‌రెడ్డి పాఠశాలలో బోధనకు అనుమతి లేదు : ఎంఇఒ

**ప్రజాశక్తి - వేంపల్లె**

పులివెందుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సతీష్‌రెడ్డి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు అనుమతి ఇంకా రాలేదని ఎంఇఒ జాఫర్ సాదిక్ తెలిపారు. ఆదివారం వేంపల్లెలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సతీష్‌రెడ్డి పాఠశాలను ప్రారంభించేందుకు మాత్రమే అనుమతి ఇచ్చామని, బోధన చేసేందుకు మాత్రం లేదన్నారు. పాఠశాల గుర్తింపునకు సంబంధించిన పత్రాలు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. జూలై 31లోపు రికగ్నైజేషన్, యుడిఐఎస్ఇ నెంబరుకు గల అర్హత పత్రాలను సమర్పించాలన్నారు. లేకపోతే గుర్తింపు ఇచ్చేందుకు వీలుకాదన్నారు. విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకూడదని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు లేని పాఠశాలల్లో చేరిన తర్వాత విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తితే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలని సూచించారు. సతీష్‌రెడ్డి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో రాష్ట్రస్థాయి విద్య బోధన మాత్రమే నిర్వహించాలని చెప్పారు. పత్రాలు ఇవ్వాలని ఇప్పటికే పాఠశాల యాజమాన్యాన్ని కోరినట్లు చెప్పారు. రాఘవేంద్ర పాఠశాల కూడా గుర్తింపును రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈనెల 20 నుండి స్పెషల్ డ్రైవ్ చేసి పాఠశాలలను తనిఖీ చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు థర్డ్‌ఫ్లోర్ ఉంటే ఫైర్ అనుమతి ఉండాల్సిందే అన్నారు. ఫైర్ అనుమతికి దరఖాస్తు చేయాలని కోరతామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించే సమయంలో ప్రభుత్వ అనుమతిపై తెలుసుకోవాలని ఎంఇఒ కోరారు.

**అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యాశాఖ అనుమతి ఉంది**

**మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి**

విద్యార్థుల అడ్మిషన్లు తీసుకునేందుకు సతీష్‌రెడ్డి ఇంగ్లీషు మీడియం పాఠశాలకు విద్యాశాఖ అనుమతులు ఇచ్చిందని ఆ పాఠశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సతీష్‌రెడ్డి ఇంగ్లీషు మీడియం పాఠశాలను ప్రీ ప్రైమరీ నుండి 7వ తరగతి వరకు నడపడానికి అన్ని అనుమతులు కోసం దరఖాస్తులు చేశామన్నారు. విద్యాశాఖ అధికారులు అడ్మిషన్లు తీసుకునేందుకు అనుమతులు ఇచ్చారని చెప్పారు. ఆ అనుమతితోపాటు కొన్ని నిబంధనలను పెట్టి ఆ మేరకు ఆగస్టు 30 తేదీలోగా పత్రాలు ఇవ్వాలని కోరామన్నారు. వాటి అన్నిటికి దరఖాస్తులు చేశామన్నారు. విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగానే సతీష్‌రెడ్డి పాఠశాలను నిర్మించినట్లు చెప్పారు. ఎలాంటి అపోహలకు తావు లేదన్నారు. 90 శాతం అనుమతులు ఉన్నాయని తెలిపారు. ఫైర్ వంటి కొన్ని అనుమతులు రావాల్సి ఉందన్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి ఇంకా తమకు సమయం ఉందని చెప్పారు. పాఠశాల ఎఒ రామగంగిరెడ్డి అనే ఉద్యోగికి అనుకోకుండా అనారోగ్యం కావడంతో దరఖాస్తులు చేసుకోవడానికి ఆలస్యం అయ్యిందన్నారు. కొందరు కావాలని దురుద్దేశంతో చేస్తున్నారని, ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**


పికారీ చేస్తున్న సిబ్బంది

పులివెందుల అర్బన్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో దోమల నివారణకు ఆదివారం మలాథియాన్ పిచికారీ చేశామని సభ్యులు సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సెలవులు పూర్తి చేసుకొని వసతి గృహాలు పునఃప్రారంభించడంతో ముందుస్తు జాగ్రత్తగా జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు మలాథియాన్ పిచికారీ చేశామన్నారు. మలాథియాన్ 6 వారాల నుండి 8 వారాల వరకు దాని పని సామర్థ్యం కలిగి ఉంటుందని సిద్దయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, వసతి గృహ సంక్షేమ అధికారులు ప్రసాద్, రవీంద్ర పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఇకనైనా అహంకారం వీడాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఇకనైనా అహంకారం వీడనాడి మెలగాలని టిడిపి రాష్ట్ర నాయకులు సీఎం సురేష్‌నాయుడు సూచించారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాడు టిడిపి జెండా ప్రొద్దుటూరులో భూస్థాపితం చేస్తా, జెండా ఎగరనివ్వను అని అహంకారంగా మాట్లాడారని పేర్కొన్నారు. కూటమి భారీ మెజారిటీతో గెలిచారని, ఉమ్మడి కడప జిల్లాలో 7 సీట్లు కూటమి విజయం సాధిం చిందన్నారు. గెలిచిన అభ్యర్థులకు, చంద్రబాబు, లోకేష్‌కు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ.. విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందారని పేర్కొన్నారు. క్రికెట్ బుకీలతో మెలిగిన రాచమల్లు, ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటో చూడాలన్నారు. రాచమల్లు తన తల్లి కోరిక మేరకు అన్నదానం కొనసాగిస్తామని చెప్పి, రాజన్న రాచమల్లు క్యాంటీన్ మూశారన్నారు. ప్రభుత్వం ద్వారా నెలకు రూ.15వేలకు లీజు తీసుకొని మూసేశారన్నారు. వారు కొనసాగిస్తే కొనసాగించినట్లు.. లేదంటే తామే స్వాధీనం చేసుకొని అక్కడ అన్న క్యాంటీన్ నెలకొల్పుతామన్నారు. త్వరలో అవినీతి వైసిపి నాయ కులు చిప్ప కూడు తినక తప్పదన్నారు. మీ అక్రమాలకు వత్తాసు పలికిన పోలీసులు, రెవెన్యూ అధికారులను వదలబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వివిఎస్ ముక్తియార్, కామిశెట్టి బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎం సురేష్ నాయుడు

## నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలను సోమవారం సాయంత్రం 5.40 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్, శిల్పారామంలో నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో శ్రీకిషోర్ అకాడమీ కడప కళాబృందం, శిల్పారామంలో సూర్య అకాడమీ మదనపల్లి కళాబృందంచే క్లాసికల్, జానపద, వెస్టర్న్ మొదలగు నృత్య ప్రదర్శనలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## అంగన్వాడీలకు జీతాలు పెంచాలి

**పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**



అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారికి జీతాలను నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ అంగన్వాడీ వ్యవస్థ మహోన్నతమైందన్నారు. కాంగ్రెసు పార్టీ మానస పుత్రిక అన్నారు. బాలబాలికల్లో, గర్భిణుల్లో, బాలింతల్లో పౌష్టికాహారం లోప నివారణ కోసం 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ అంగన్వాడీ వ్యవస్థను ఏర్పాటు చేసిందని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు తల్లిగా, ఉపాధ్యాయులుగా, నర్సుగా, డాక్టర్‌గా బహుముఖ సేవలు చేస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీలకు ఇస్తున్న జీతాలు చాలా తక్కువ అన్నారు. అంగన్వాడీ వర్కర్లకు నెలకు రూ.11,500 సహాయకులకు రూ.7వేలు గౌరవ వేతనం ఇవ్వడం బాధకరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడ వీరు అనర్హులుగా చేయడం దారుణమన్నారు. అంగన్వాడీలు పదవీ విరమణ చేసిన తర్వాత వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటుందని ఆయన తెలిపారు. అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేపట్టగా గత వైసిపి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని తెలిపారు. నూతన టిడిపి ప్రభుత్వమైనా అంగన్వాడీల సమస్యలపై దృష్టి పెట్టి జీతాలు పెంచాలని సిఎం చంద్రబాబును తులసిరెడ్డి కోరారు.


గూడెం చెరువు నడిరోడ్డులో ఉన్న ఇసుక


## నడిరోడ్డుపై ఇసుకను తొలగించరూ..!

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

మండల పరిధిలోని గూడెంచెర్వు గ్రామం నడిరోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. జమ్మలమడుగుకు మూడు కిలోమీటర్ల దూరంలోనూ, పెన్నానదికి పక్కనే గూడెంచెర్వు ఉంది. పెన్నానది నుంచి గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుకను తరలించారు. ప్రస్తుతం కూడా కొందరు రాత్రిపూట ఇసుకను ట్రాక్టర్‌లతో తోలుతున్నారు. రాత్రిళ్లు ఇసుకను తొలడం వల్ల ఇసుక రోడ్డుకు ఇరువైపులా పడుతోంది. గూడెంచెర్వు మీదుగా రాజీవ్ నగర్, పొన్నతోట, నర్సోజి కొట్టాల, ఆర్అండ్ఆర్ కాలనీ, ఒంటిమిద్దె, పి.బొమ్మేపల్లి, బిఆర్ కొట్టాల, గండికోట, జి.కొట్టాలపల్లె గ్రామాలకు దారి ఉంది. ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రతి నిత్యం జమ్మలమడుగు పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. గూడెంచెర్వు క్రాస్ రోడ్డు వద్ద, ఆదర్శ స్కూల్ వద్ద ఇసుక నడిరోడ్డులో ఉండడం వల్ల వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అసహనానికి గురవుతున్నారు. ఇబ్బందులు పడుతున్నారు. పలువురు బైక్స్ ఇసుకలో అదుపుతప్పి కిందపడిన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇసుకను అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవడమే కాక, రోడ్డులో పడి ఉన్న ఇసుకను తొలగించాలని గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.

## 'శ్రీవిద్య'కు ఉత్తమ ర్యాంకులు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**


హరిణి (టౌన్ ఫస్ట్), అలీమా సుహానా (టౌన్ సెకండ్), స్పందన

స్థానిక సూపర్ బజార్ రోడ్‌లోని శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ భాగంలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ రమణా రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏపిఓఈటీ ఇంజనీరింగ్ విభాగంలో పివి స్పందన 5608, ఎన్ కార్తీక్ శర్మ 13,380, జి తేజేశ్వర్‌రెడ్డి 15906 ర్యాంకులు సాధించారన్నారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో వై.హరిణి 6517 ర్యాంకుతో టౌన్ ఫస్ట్‌గా నిలిచిందన్నారు. ఎస్ అలీమా సుహానా 9961 ర్యాంకుతో టౌన్ సెకండ్‌గా నిలిచిందన్నారు. ఐ రిషిత వైష్ణవి 16025 ర్యాంకు సాధించిందని తెలిపారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాల డైరెక్టర్ ఎస్ శ్రీకాంత్‌కుమార్ రెడ్డి, ఎం రామ్మోహన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


మాట్లాడుతున్న ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం

## నూతన ఎడ్యుకేషనల్ పాలసీని వెనక్కి తీసుకోవాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఎడ్యుకేషనల్ పాలసీని వెనక్కి తీసుకోవాలని ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ విద్యాలయాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 2024 జూన్ 15 నుంచి జులై 15వ తేదీ వరకు ఎంపిజె ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విద్య జాగృతి ఉద్యమం నిర్వహించ బోతుందన్నారు. క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ప్రయత్నం చేస్తోందన్నారు. విద్య హక్కు చట్టం-2009ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు సంబంధించిన సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ అస్లం పాల్గొన్నారు.

## 'ముక్కా'కు సన్మానం

**ఓబులవారిపల్లి :** మండలం పరిధిలో బోటిమీదిపల్లి పంచాయితీ, కాకర్లవారిపల్లి గ్రామంలోని మల్లాలమ్మతల్లి దేవాలయానికి విచ్చేసిన రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డికి సర్పంచ్ వీరపు నేని వెంకటయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.